క్లుప్తంగా

రేపు వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి



సత్తెనపల్లి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఈ నెల 8న నియోజకవర్గంలోని ప్రతి వార్డు, గ్రామంలో ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం అయిన మాట్లాడారు. దివంగత మహానేత రాజశేఖర్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను రూపొందించి వాటిని ప్రజలకు చేరువ చేశారన్నారు. 108, 104, జలయజ్ఞం, రైతులకు పూర్తి రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇలా ఎన్నో సంక్షేమ పథకాలను అందించారన్నారు. అలాంటి మహానేతను స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పలు సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొండవీటికి అభినందనలు



అమరావతి: మండలంలోని ధరణికోటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండవీటి కోటేశ్వరరావును రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శిగా నియమించటంతో ఆదివారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. మండల పరిధిలోని మల్లాదిలో క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలాలక్ష్మీనరసింహారావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, ఎండ్రాయి సర్పంచి నాయుడు రాంబాబు, నాయకులు వెంపా వాసు, వీరరాఘవయ్య, అమరేశ్వరరావు, సాంబయ్య, శ్రీను, రామారావు తదితరులు శాలువాలతో సత్కరించారు. కొండవీటి కోటేశ్వరరావు మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఘనంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి



క్రోసూరు: డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం క్రోసూరు మండల బీజేపీ కార్యాలయంలో ఘనంగా ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దమ్మాలపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖర్జీ జనసంఘ పార్టీని ఏర్పాటు చేసి దేశంలో తొలి హిందూ వాద పార్టీని స్థాపించారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నారు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): మండలంలోని పలుదేవర్లపాడు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గొర్రెపాటి సాగర్ మృతదేహానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఎంజీఎం రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం..!



సత్తెనపల్లి: ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఏదో పూల మొక్క అనుకుంటే పొరపాటే. అది విద్యుత్ స్తంభం. ఈ విద్యుత్ స్తంభం ఎక్కడో మారుమూల గ్రామీణ ప్రాంతంలో లేదు. సాక్షాత్తు పట్టణ రఘురామ్‌నగర్‌లోని స్వర్గీయ మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు నివాసానికి పక్కన రోడ్‌లో ఉంది. స్తంభంపై వరకు పిచ్చి మొక్కలు అల్లుకొని ఎండి పోయి అసలు ఇది విద్యుత్ స్తంభమేనా అనేలా తయారైంది. కూటమి ప్రభుత్వ ఏడాది పాలన పూర్తయినప్పటికీ ఇలాంటి విద్యుత్ స్తంభాలపై ఉన్న పిచ్చి మొక్కలు తొలగించేందుకు కూడా కనీసం చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అత్యవసరానికి ఎటు వెళ్లాలి..?

- ప్రధానంగా మహిళలు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగుల ఇక్కట్లు
- అధికారులకు కోరుతున్నా ఫలితం శూన్యం

మండల కేంద్రంలో సామాజిక మరుగుదొడ్లు లేక అవస్థలు

రాజుపాలెం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి పరిశుభ్రత, స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర అంటూ గ్రామాలలో విస్తృతంగా ప్రచారాలు చేయడమేగాక అధికారులు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు అధికారులు, నాయకులు ఊదరగొట్టేలా ప్రసంగాలు ఇవ్వడం తప్ప ఎక్కడా పరిశుభ్రత మాత్రం కనబడడం లేదు. పరిశుభ్రతపై అంతగా ప్రచారం చేస్తున్న అధికారులు, నాయకులు మండల కేంద్రంలో ప్రజలకు కనీస అవసరమైన సామాజిక మరుగుదొడ్లు నిర్మించే ఆలోచన చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు ఇబ్బందులు పడుతున్నారని అత్యవసరానికి ఎటు వెళ్లాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలో ఒకే కాంపౌండ్‌లో వరుసగా మండల పరిషత్, తహసీల్దారు కార్యాలయం, విద్యా వనరుల కేంద్రం, వెలుగు కార్యాలయం, సబ్ ట్రెజరీ కార్యాలయం, శాఖా గ్రంథాలయం, గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఈ కార్యాయాలకు ప్రతి రోజు వివిధ పనుల నిమిత్తం గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. వారు మరుగుదొడ్లు లేక కాలకృత్యాలు తీర్చుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. అధికారులకు మాత్రంలో వారి వారి కార్యాలయాల్లో ఏర్పాటు చేసుకున్నారు. కానీ జనం కోసం మాత్రం సామాజిక మరుగుదొడ్లు, బాత్ రూంలు నిర్మించాలనే ఆలోచన కూడా చేయక పోవడం శోచనీయం.



రాజుపాలెం మండల పరిషత్ కార్యాలయం

ఎక్కడ కూర్చోవాలి

మండల కేంద్రంలో బస్టాండ్ సమీపంలో రహదారి పక్కనే యూనియన్ బ్యాంక్ కలదు. నిత్యం వందల సంఖ్యలో వినియోగదారులు లావాదేవీలు జరుపుకోవడానికి వస్తున్న మహిళల పట్ల అధికారులు చిన్న చూపు చూస్తున్నారు. బ్యాంక్‌లో సుమారు 700 డ్వాక్రా గ్రూపు మహిళలకు చెందిన ఖాతాలు ఉన్నాయి. రిటైర్డ్ ఉద్యోగస్తులు పింఛన్‌లు ప్రతీ నెల తీసుకుంటుంటారు. నిత్యం ఇంతమంది జనం వస్తున్నా సామాజిక మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు లేకపోవడంతో ప్రజలు ముఖ్యంగా మహిళలు నానా అవస్థలు పడుతున్నారు. అంతే గాక వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు, షుగర్ పేషెంట్‌లు బ్యాంకుకు వస్తుంటారు. సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకులో కూర్చోవడానికి కుర్చీలు కూడా లేవని గంటల తరబడి నిలుచునే ఉండాల్సి వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు. మధ్యాహ్నం సమయంలో బ్యాంకు సిబ్బంది భోజనం చేయడానికి వినియోగదారులందరిని ఉన్న పళంగా బయటకు పంపించి తలుపులు వేసేస్తున్నారు. ఎక్కడ కూర్చోవాలని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రాజుపాలెం యూనియన్ బ్యాంక్ ముందు వేచి ఉన్న మహిళలు



బ్యాంక్‌లో క్యూలో నిల్చొని ఉన్న వినియోగదారులు

ఇబ్బందులు పడుతున్న మహిళలు



మండలంలోని అనేక గ్రామాల నుంచి నిత్యం కార్యాలయాలకు, యూనియన్ బ్యాంక్‌కు మహిళలు వచ్చి పోతుంటారు. మహిళలు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు కాలకృత్యాలకు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరమైనప్పుడు సామాజిక మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు. అనేక సార్లు అధికారులకు చెప్పిన ఫలితం శూన్యం. ఇప్పటికైనా బ్యాంక్ అధికారులు స్పందించి పబ్లిక్ టాయిలెట్‌లు నిర్మించాలి.

– ఎస్.దుర్గాభాయి, హైందవ మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు, రాజుపాలెం

త్వరలో ఏర్పాటు చేస్తాం

మహిళలు టాయిలెట్స్ కోసం ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, బ్యాంక్ బిల్డింగ్ యజమానితో మాట్లాడి త్వరలో ఏర్పాటు చేస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం.

– షైలేష్ భగత్, యూనియన్ బ్యాంక్ మేనేజర్, రాజుపాలెం

నిర్వహణ కష్టం

సామాజిక మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు కట్టడం చాలా తేలిక, వాటి నిర్వహణ చేయడం చాలా కష్టంగా మారుతుందని, గతంలో నేను ఎంపీడీవోగా చేసిన కార్యాలయాల్లో సామాజిక మరుగుదొడ్లు కట్టామని, నిర్వహణ చేయలేక మూతపడ్డాయని, అయినా సరే పంచాయతీరాజ్ ఏఈని సంప్రదించి సామాజిక మరుగుదొడ్లు కట్టేందుకు ప్రయత్నిస్తాం.

– జీవీ సత్యనారాయణ, ఎంపీడీవో రాజుపాలెం

పెంపుడు జంతువులకు టీకాలు



పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

నకరికల్లు: పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలతో జంతువుల కాటు వలన మనుషులకు సోకే వ్యాధులను అరికట్టవచ్చని వెటర్నరీ ఏడీఏ డాక్టర్ వెంకటేశ్వర్లునాయక్ సూచించారు. వరల్డ్ జూనోసిస్ డేను పురస్కరించుకుని మూగజీవాలకు స్థానిక పశు వైద్యశాలలో ఆదివారం వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులను అరికట్టేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. జంతువుల పెంపకందారులు తమ మూగజీవాలకు వ్యాక్సిన్లు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో సహాయకులు పి.సూర్య, విజయ్‌కుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

20 కుక్కలకు రేబిస్ టీకాలు

రాజుపాలెం: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో ఏడీఏ డాక్టర్ వీరయ్య 20 కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలను ఆదివారం వేశారు. జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులంటారని తెలిపారు. ఈ వ్యాధుల్లో అతిముఖ్యమైంది రేబిస్ అని ఇది వంద శాతం ప్రమాదకరమైన వ్యాధని అన్నారు. కుక్కలను పెంచే యజమానులు క్రమం తప్పకుండా రేబిస్ టీకాలు వేయించడం వలన వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

జంతువుల నుంచి వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్

క్రోసూరు: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం క్రోసూరు మండల ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్ జంతువుల నుంచి వచ్చే వ్యాధులు, నివారణ గురించి ఒక ప్రకటనలో వివరించారు. జూనోసిస్ వ్యాధులు అనగా పశువుల నుంచి మనుషులకు లేదా మనుషుల నుంచి పశువులకు వ్యాపించే రేబిస్, ఆంత్రాక్స్ వంటి వ్యాధులని.. అవి ప్రమాదాన్ని కలిగిస్తాయన్నారు. కావున జంతువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. రేబిస్ రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం అన్నారు. పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలన్నారు. కుక్క కరిచిన చోట శుభ్రంగా, ధారగా నీళ్ల పోస్తూ కడగాలని, వెంటనే సమీపంలోని ఆస్పత్రిలో ఇంజక్షన్ చేయించుకోవాలన్నారు. కుక్క కరిస్తే యాంటీ రేబిస్ టీకా ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా లభిస్తుందన్నారు. వెంటనే సరియైన చికిత్స చేయించుకోని పక్షంలో ప్రాణాలకు ముప్పు ఉంటుందన్నారు. కుక్క కాటుకు గురి అయిన ఆవు, గేదె, మేక, గొర్రెల పాలు తాగటం కూడా హానికరమని శ్యాంసన్ తెలిపారు.



కుక్కలకు టీకాలు వేస్తున్న ఏడీఏ డాక్టర్ వీరయ్య

భక్తిశ్రద్ధలతో మొహర్రం



గుండ్లపల్లిలో పీర్ల చావిడి వద్ద కిక్కిరిసిన భక్తులు

నకరికల్లు: కర్బలా మైదానంలో ధర్మ యుద్ధం చేస్తూ ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలకు గుర్తుగా మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో మొహర్రంను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని పీర్ల చావిడి వద్ద నుంచి పీర్లను ఘనంగా ఊరేగించారు. పెద్ద సంఖ్యలో కులమతాలకు అతీతంగా ప్రజలు ఊరేగింపులో పాల్గొన్నారు. అమరుల త్యాగాలను గుర్తు చేస్తూ మాతంపాడారు. ఊరేగింపుతో గ్రామ ప్రధాన వీధులన్నీ కిటకిటలాడాయి. యా...హుస్సేన్..యా...హుస్సేన్ అంటూ నినాదాలు, అమరవీరుల నామస్మరణతో వీధులన్నీ మారుమోగాయి. పురవీధుల్లోకి పీర్లురాగా భక్తులు వార్లు పోసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. మృతవీరుల గుర్తుగా ఊరేగించిన పీర్లను సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు. ఊరేగింపులో అవాంఛనీయ ఘటనలు జరగకుండా సత్తెనపల్లి రూరల్ సీఐ పి.కిరణ్ ఆధ్వర్యంలో ఎస్ఐ చల్లా సురేష్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ముప్పాళ్ళలో మొహర్రం

ముప్పాళ్ళ: ముస్లిం వీరుల త్యాగాలకు గుర్తుగా నిర్వహించే మొహర్రం పండుగను మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ముస్లిం వీరులకు గుర్తుగా పీర్లను అందంగా అలంకరించి గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళ, గోళ్ళపాడు, తొండపి, లంకెలకూరపాడు గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు స్ఫూర్తిదాయకం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి



సత్తెనపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ గజ్జల

సత్తెనపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో, అమరావతి బస్టాప్ సెంటర్‌లో పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు చిలుకా జైపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశానికి దిశా నిర్దేశం చేసి జగ్జీవన్‌రామ్ దేశాభ్యున్నతికి చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. అటువంటి మహనీయుడిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. ముందుగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, షేక్ మౌలాలి, రాయపాటి పురుషోత్తమరావు, గుజ్జర్లపూడి సతీష్, అచ్యుత శివ ప్రసాద్, గుజ్జర్లపూడి కృపారావు, తుమ్మల వెంకటేశ్వరరావు, చుక్కా మోషే, చావా రమేష్, సయ్యద్ ఖాజా, కూచిపూడి సైమన్, యాసారపు బాబు, జొన్నలగడ్డ సాగర్, వేల్పుల అఖిల్, విప్పర్ల కొండలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

డాక్టర్ విలియం కేరీ మెమోరియల్ సేవా సంస్థ ఆధ్వర్యంలో...

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి ఉప ప్రధాని డాక్టర్ జగజ్జీవన్‌రామ్ వర్ధంతి రెవ.డాక్టర్ విలియం కేరీ మెమోరియల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని అమరావతి బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రత్తిపాటు తహసీల్దార్ గుజ్జర్లపూడి కరుణకుమార్, సంస్థ అధ్యక్షులు బంకా బాబురావు, ఉపాధ్యక్షులు గుజ్జర్లపూడి యోహాను, కార్యదర్శి గుజ్జర్లపూడి భానుప్రకాష్, కోశాధికారి గుజ్జర్లపూడి మనోజ్‌కుమార్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...

స్వర్గీయ డాక్టర్ జగ్జీవన్‌రామ్ వర్ధంతి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్‌పాల్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్‌ను దేశ ప్రజలు బాబూజీగా పిలిచేవారన్నారు. బిహార్‌లో వెనకబడిన, నిమ్న వర్గాల నుంచి రాజకీయ వేత్తగా ఎదిగి పార్లమెంటులో 40 ఏళ్ల పాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి, నాయకులు షేక్ చాన్‌బాషా, షేక్ ఆరిఫ్, కోట ఆనంద్, సిద్ధల మోహన్‌రావు, జెట్టి శేఖర్, కోటపాటి సాంబశివరావు తదితరులు ఉన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ముప్పాళ్ళ: మండలంలోని ముప్పాళ్ళ, గోళ్ళపాడు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కందుల జార్జి, గోళ్లపాడు మాజీ సర్పంచ్ పరిమి రత్నం, చిలక అమర్నాథ్, గద్దల ఏసుదాసు, గద్దల కోటేశ్వరరావు, పరిమి అబ్రహం, నాగేంద్రబాబు, కాలేబు, పేతురు తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...



గోళ్లపాడులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాజీ సర్పంచ్ రత్నం తదితరులు



క్రోసూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించిన బీజేపీ నాయకులు

క్రోసూరులో...

క్రోసూరు: స్వాతంత్ర్య సమరయోధుడు, నవ సమాజ నిర్మాణానికి నిర్విరామ కృషి చేసిన దళిత జాతి ముద్దు బిడ్డ, మాజీ ఉప ప్రధాని, స్వర్గీయ డాక్టర్ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని మండల బీజేపీ ఆదివారం ఘన నివాళులర్పించింది. క్రోసూరులోని గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు దమ్మాలపాటి వెంకట శ్రీనివాసరావు, నారు శ్రీనివాసరెడ్డి, తుమ్మపూడి వెంకటేశ్వరరెడ్డి, పోనుగుపాటి శ్రీకాంత్, వేణుగోపాలరావు, సుబ్బారావు, తలారి లక్ష్మీనరసింహమూర్తి, పులిబండ్ల సాంబయ్య, కుంభా బాబురావు, ఆవుల శివకాంత్, ఉప్పు హరిబాబు, రావెళ్ల సౌజన్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పర్వదిన పూజలు



సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు



సత్తెనపల్లిలో వైకుంఠ హస్త అలంకారంలో శ్రీవారు

సత్తెనపల్లి: హిందువుల పండుగ తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామున తలంటు స్నానాలు ఆచరించి ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. భక్తుల రాకతో ఆలయాలు కిటకిటలాడాయి. పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం, రైల్వేస్టేషన్ రోడ్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయం, వడ్డవల్లిలోని రామాలయం, వేంకటేశ్వరస్వామి దేవాలయం, ఐదులాంతర్ల సెంటర్లోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయం, మాచర్ల రోడ్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, వడ్డవల్లి వీరాంజనేయస్వామి దేవాలయం, వాసవీ నగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం, త్రిశక్తి దుర్గాపీఠంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



చాగంటివారిపాలెంలోని జగన్నాథస్వామి

ముప్పాళ్ళలో తొలి ఏకాదశి వేడుకలు

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను తొలి ఏకాదశి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. హిందూ సంప్రదాయం ప్రకారం తొలి పండుగ కావటంతో ఆయా దేవాలయాల్లో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని చాగంటివారి పాలెం గ్రామంలో వేంచేసియున్న బలభద్ర సహిత జగన్నాథస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని కాశీ అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, మాదలలోని సాగరేశ్వరస్వామి ఆలయం, నార్నెపాడులోని శంభులింగేశ్వరస్వామి ఆలయంలోను స్వామి వార్లకు జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.


దేశమ్మ తల్లి... దయ చూపించమ్మా

గ్రామ దేవతకు పొంగళ్లు పొంగించి, వారు పోసిన గ్రామస్తులు

పెదకూరపాడు: గ్రామ దేవత దేశమ్మ తల్లిని సకాలంలో వర్షాలు పడి పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉండేలా దయచూపించమ్మా అంటూ మండలంలోని 75త్యాళ్ళూరు గ్రామ ప్రజలు ఆదివారం వేడుకున్నారు. ఆషాడ ఆదివారం పురస్కరించుకుని గ్రామంలోని చిన్నారులు, యువకులు పెద్దలు అమ్మవారికి వారు పోశారు. అనంతరం గ్రామ పెద కాపు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు దేశమ్మ తల్లికి తొలి పొంగళ్లను నైవేద్యంగా పెట్టారు. అనంతరం గ్రామంలోని మహిళలు సామూహికంగా ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లు పొంగించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం మేళతాళాలతో, బాజ భజంత్రీలతో ప్రభను కట్టి గ్రామ పుర వీధులలో ఊరేగించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు.



ప్రత్యేక అలంకరణలో దేశమ్మ తల్లి



అమ్మవారి పొంగళ్లు పొంగిస్తున్న గ్రామ పెద్ద కాపు, పెద్దలు

'సంఘ స్వరం' ఆధ్యాత్మిక మాస పత్రిక ఆవిష్కరణ



సత్తెనపల్లి: పట్టణంలోని బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో 'సంఘ స్వరం' అనే సంఘ సమాచార, ఆధ్యాత్మిక మాస పత్రికను దైవజనులు రెవ. జరుగుమల్లి ఇశ్రాయేలు ఆదివారం చర్చి ఆవరణలో ఆవిష్కరించారు. ప్రతి నెల విడుదల కానున్న ఈ పత్రికను క్రమం తప్పక సంఘస్థులు చదవాలన్నారు. క్రియారూపక విశ్వాసంలో మరింత స్థిరపడడానికి దోహదం చేస్తుందన్నారు. బాప్టిస్టు సంఘాల గురించి తెలుసుకోవచ్చన్నారు. అనంతరం సంఘ సభ్యుడు, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు గర్నెపూడి సాల్మన్‌రాజును కార్యవర్గం సత్కరించింది. ఆయా కార్యక్రమాల్లో సంఘ కార్యదర్శి కె.ఎం.అనిరాజ్, సంయుక్త కార్యదర్శి బంకా కిషోర్‌బాబు, కోశాధికారి రవి రాజు, ఉపకోశాధికారి వందన్ కుమార్, కార్యవర్గ సభ్యులు గంగవరపు ప్రసాద్, రాచపూడి జయపాల్, దంతం కుమార్, ఆనందరావు, రాజ రత్నం ఉన్నారు.

వ్యక్తిపై దాడి

మాచవరం: మండల కేంద్రమైన మాచవరం ఎస్సీ కాలనీలో వ్యక్తిపై దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కాలనీకి చెందిన సేదల సాగర్‌పై అదే కాలనీకి చెందిన జార్జితో పాటు మరో ఇద్దరు ఇనుప రాడ్డుతో దాడి చేశారు. ఘటనలో సాగర్‌కు తల నుదుటి భాగం, ముఖంపై గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.